# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత దేశం 2025 సంవత్సరంలో జాతీయ భద్రత నుండి క్రీడల వరకు వివిధ అంశాలలో బలమైన ముద్ర వేసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది.**

3. **దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా అయోధ్య నిలిచిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు**

4. **తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**

5. **ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

==========================

భారత దేశం 2025 సంవత్సరంలో జాతీయ భద్రత నుండి క్రీడల వరకు ప్రపంచంలోని అతి పెద్ద వేదికలపై వివిధ అంశాలలో బలమైన ముద్ర వేసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన్ కీ బాత్ 129 వ సంచిక కార్యక్రమంలో నిన్న ఆయన మాట్లాడుతూ, 2025వ సంవత్సరంలో భారత దేశం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ప్రత్యేకించి "ఆపరేషన్ సింధూర్ " ప్రతి భారతీయునికి గర్వకారణంగా నిలిచిందని అన్నారు. భద్రత విషయంలో దేశం రాజీ పడబోదని ప్రధాన మంత్రి స్పష్టం చేస్తూ ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి పనుల పురోగతి, భూ కేటాయింపులపై చర్చ జరగనుంది. అలాగే రెండో విడత ల్యాండ్ పూలింగ్ అంశంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లాలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవానిలంకలో ఆమె నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక డిజిటల్ భవన్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ -ఎఐ నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ,

వాయిస్.. 25 సెకన్లు

--------------------------

దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా అయోధ్య నిలిచిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తర ప్రదేశ్ లోని అయోధ్య శ్రీరాముడిని ఆయన నిన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. భారత్‌లో ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య రామాలయం మారిందని అన్నారు. దేశంలోని ఇతర దేవాలయాలకు అయోధ్య రామాలయం మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ పాలనకు రాముడి పాలనే కొలమానంగా తీసుకుంటారని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం జిల్లా దువ్వాడ మీదుగా ఎర్నాకుళం వెళ్లే టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అర్ధరాత్రి ఒంటి గంటా 30 నిమిషాల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఎలమంచిలి స్టేషన్ సమీపంలోని పాయింట్ వద్ద లోకో పైలట్లు గుర్తించి రైల్వే స్టేషన్‌లో రైలును నిలుపుదల చేశారు. రెండు బోగీలకు మంటలు పూర్తిగా వ్యాపించి దగ్ధమయ్యాయి. రైలులోని ప్యాంట్రీ కారును ఆనుకుని ఉన్న బీ1, ఎం2 ఏసీ బోగీల్లో మంటలు చెలరేగాయని రైల్వే అధికారులు తెలిపారు. అనకాపల్లి, ఎలమంచిలి, నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తర్వాత రైల్వే అధికారులు కాలిన రెండు బోగీలను తొలగించి, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశారు.

--------------------------

తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ప్రారంభం కానున్న సమావేశాల్లో తొలిరోజు దివంగత మాజీ శాసనసభ్యులకు సంతాప తీర్మానాలు సహా కొన్ని బిల్లులకు సంబంధించిన పత్రాలను సభలో ప్రవేశపెట్టనున్నారు. జీహెచ్ఎంసీ వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ వంటి ఆర్డినెన్సులకు ఈ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించనున్నారు. తొలిరోజు సమావేశం అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఎన్ని రోజుల పాటు సభలు నిర్వహించాలో నిర్ణయించనున్నారు.

--------------------------

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఉండేలా రైల్వే నెట్‌వర్క్‌ను రూపొందించడంలో 2025 సంవత్సరం భారతీయ రైల్వేలో పలు మైలురాళ్ళకు వేదికగా నిలిచింది. సామాన్యులకు సౌకర్యవంతమైన రైలు

ప్రయాణం అందించేలా ఈ ఏడాది  దేశవ్యాప్తంగా 13 కొత్త అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టడంతో వీటి సంఖ్య 30కి చేరుకుంది. ఈ సంవత్సరం 25 వేల కోట్ల రూపాయాలకు పైగా విలువైన 42 ప్రాజెక్టులు దేశానికి అంకితం చేయబడ్డాయి. 2025లో సాధారణ సేవలతో పాటు, అదనపు రద్దీని నిర్వహించడానికి రైల్వే శాఖ  43 వేల కంటే ఎక్కువ ప్రత్యేక రైలు ప్రయాణాలను నడిపాయి.

----------------------------

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు నగరంలో 4.6 కోట్ల రూపాయలతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు నజీర్ అహ్మద్ తో కలిసి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ప్రజల ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఎక్కువ కాలం మన్నేలా త్రాగునీటి ట్యాంకుల నిర్మాణాన్ని చేపడుతున్నామని కేంద్రమంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ .. 27  సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో 4.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే తెలంగాణాలోని కొమరంభీం అసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో  7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

======================